# నరుడా...! ఏమీ నీ ఒక్క కోరిక..?

-బి.గీతిక

డిసెంబర్ 31 రాత్రి...

దేశమంతా ఉత్సాహంగా కేరింతలు వేస్తూ ఇంకా మేలుకునే ఉంది. ప్రతి ఒక్కరిలోనూ కొత్త సంవత్సరం గురించి కొత్త కొత్త ఊహలు... రాబోయే నూతన సంవత్సరం తమకు బాగా కలిసిరావాలని కోటి ఆశలు.. అందర్లోనూ నూతనోత్తేజం!

జరగబోయే ఓ భయంకర విధ్వంసక విస్ఫోటనానికి అది ప్రారంభం. సన్నగా మెల్లగా మొదలైంది.

ఆ అర్థరాత్రి సమీపిస్తున్న వేళలో...ఓ మారుమూలనున్న పూరిగుడిశెలో రెక్కాడితేగానీ డొక్కాడని ఒక కూలివాడు గుడిశె ముందున్న నులక మంచంమీద పడుకుని ఆకాశంలోని చుక్కల వంక చూస్తున్నాడు.

అతనేదో ఆలోచనలో ఉండగా "నరుడా! ఏమీ నీ ఒక్క కోరిక?" అని విన్పించి ఉలిక్కిపడి లేచి కూర్చుని చుట్టూ చూశాడు.

అతని మంచం పక్కగా ఓ పండు ముదుసలి నుంచుని ఉన్నాడు.

కూలివాడు ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ "ఎవరు మీరు?" అనడిగాడు.

"నా పేరు విశ్వంభర. నువ్వు చాలా కష్టంలో ఉన్నట్టున్నావు. నీకేదన్నా తీరని కోరికుంటే చెప్పు నాయనా...తీరుస్తాను" అన్నాడు ముదుసలి.

"రెక్కలమీద బతికేవాణ్ని. నాకు కోరికలేం ఉంటాయి పెద్దాయనా. ప్చ్...ఏంటో రోజులు చాలా మారిపోయాయి. పనంతా యంత్రాలదే. ఇదవరలో మాకు చేతినిండా పని. పనికి తగ్గ డబ్బు. కడుపునిండా తినేటోల్లం. ఇప్పుడు పనులే కరువైపోయాయి. సరే...నా కోరిక తీరుస్తానంటున్నావుగా...నాకు చేతినిండా పని దొరికి కడుపు నిండేలా చూడు చాలు. నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను" అన్నాడు కూలివాడు.

"అలాగే నాయనా! నువ్వు విశ్రాంతి తీసుకో" చెప్పి వెళ్ళిపోయాడు విశ్వంభర.

అదే సమయానికి ఆ గుడిశెకు పక్కనే ఉన్న మూడంతస్థుల మేడలోని బాల్కనీలో- తృప్తిగా చుట్ట పొగ పీలుస్తున్న షావుకారు ముందు ప్రత్యక్షమై "నరుడా! ఏమీ నీ ఒక్క కోరిక?" అడిగాడు విశ్వంభర.

షావుకారు ముదుసలిని ఎగాదిగా చూసి, "నా కోరిక నువ్వెక్కడ తీర్చగలవులే. ముందు నీకు మంచి గుడ్డలు కుట్టించుకో" అన్నాడు ఎగతాళిగా.

"నా గురించి నాకు చింతలేదు నాయనా. నీకున్న ఒక చింతేమిటో చెప్పు. తీరుస్తాను" చెప్పాడు విశ్వంభర...చిరునవ్వుతో.

"ఇంతగా అడుగుతున్నావు కాబట్టి చెప్తున్నాను. అదిగో ఆ పక్కనే ఓ గుడిశె ఉంది కదా...అక్కడో కూలోడుంటున్నాడు. వాడి స్థలాన్ని కలుపుకోవాలని నా ఆశ. వాడు అమ్మనంటున్నాడు. అది తీరేలా చూడు చాలు" అన్నాడు షావుకారు.

"నీ కోరిక నెరవేరుతుంది నాయనా. కానీ నువ్వెళ్ళి అతని స్థలాన్ని కొనుక్కుంటానని అడిగితేనే" చెప్పి వెళ్ళిపోయాడు విశ్వంభర.

ఆ సమయంలోనే- మూడంతస్థుల మేడపక్కనే ఉన్న డాబా ఇంట్లోని యజమానిని అదే ప్రశ్న అడిగాడు విశ్వంభర.

ఆ క్షణంలోనే ఆ వీధిలో ఉన్న కోమటి శెట్టి ముందు ప్రత్యక్షమై అదే ప్రశ్నని అడిగాడు విశ్వంభర. శెట్టి విశ్వంభరని పట్టి పట్టి చూస్తూ "నన్ను నరుడంటున్నావ్...నువ్వు కాదా? ఇంతకీ అసలు నువ్వెవరివి?" అడిగాడు.

"నా పేరు విశ్వంభర!"

"విశ్వాన్ని భరిస్తావా?" అనుమాన పక్షిలా అడిగాడు.

"నీకెలా తోస్తే అలా అనుకో నాయనా!"

"నీ బాధేంటసలు?" అడిగాడు శెట్టి.

"నీకేదైనా తీరని కోరికుంటే ఒకటి తీర్చి వెళదామని"

"ఒక్కటే తీరుస్తావా?"

"అవున్నాయనా!"

శెట్టికి విశ్వంభర వాలకం చూస్తే అతనేదో శక్తి కలిగిన వాడిలా అనిపించాడు. అందుకే "ఆ ఒక్క కోరిక కింద నువ్వెవరో చెప్పు" అన్నాడు ఆరాగా.

"అది చెప్తే నువ్వు గుండాగి ఛస్తావ్. మరి చెప్పమంటావా నాయనా?" కూల్‌గా అన్నాడు విశ్వంభర.

"అమ్మో! అయితే వద్దులే. నా వ్యాపారం ఏం బాగుండడం లేదు. సరుకుల కోసం జనాల్తో నా కొట్టంతా నిండిపోయేలా చూడు" అడిగాడు ఆశగా శెట్టి.

కోమటి కొట్టు పక్కనే ఉన్న ఓ బడుగు జీవి- రోజంతా కాయకష్టం చేసి, అలసిసొలసి వచ్చి ఆకలితో అన్నం ముందు కూర్చున్నాడు. ఎదురుగా నిలబడి ఒక కోరికని తెలపమన్న విశ్వంభరతో "కూర్చో సామీ! నాకాకలేస్తోంది. అన్నం తిన్నాక మాట్లాడుకుందాం" అంటూ గబదబా అన్నం కలిపి ఓ ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

"లేదు నాయనా నేను వెంటనే వెళ్ళాల్సిన పని ఉంది. నీకున్న కోరికల్లో ఒక్క కోరికను మాత్రం చెప్పు. తీర్చి వెళ్తాను" అన్నాడు విశ్వంభర ఇంకా నుంచోనే. అన్నం తింటున్న బడుగు జీవి పంటికి రాయి తగిలి, పళ్ళూ, ఒళ్ళూ జివ్వుమన్నాయి. రోజూ ఈ నరకాన్ని భరిస్తున్న అతనికి కోమటిశెట్టి మీద కోపం తారాస్థాయికి చేరింది.

"ఓయ్! ముసలాడా! నిజంగా నా కోరిక తీరుస్తావా?" అన్నాడు సందేహంగా.

"తీరుస్తాను. చెప్పు నాయనా?" చెప్పాడు విశ్వంభర.

"నేను కాయకష్టం చేసి సంపాదించినా సరైన కూడు తినలేకపోతున్నాను. నాకా చాలీచాలని బత్తెం. అరువు తేకా తప్పదాయె. అడిగినంత డబ్బు ఈయకా తప్పదాయె. పూటపూటకీ ఈ చచ్చుపుచ్చు సరుకే గతవుతోంది'' అంటూ చేతిలోని అన్నాన్ని విశ్వంభరకి చూపిస్తూ "ఆ శెట్టిగాడి కొట్లోని సరుకంతా పాడైపోవాలి. వాడికి తినడానికి కూడా వాడి సరుకు పనికిరానంత పుచ్చిపోవాలి. ఇదే నా కోరిక'' అన్నాడతను.

ఒక మాఫియా దొంగ, మరో వడ్డీ వ్యాపారి, ఇంకో పోలీసాఫీసర్,



ఓ ప్రభుత్వోద్యోగి, మరో మంత్రి...ఒకరేమిటి అందరూ ఏదో ఒక కోరిక కోరుకున్నావారే!

★ ★ ★


అందరి కోరికలూ విని అంతర్థానమయ్యాడు విశ్వంభర.

★ ★ ★

తెల్లారింది. ఏం జరిగింది..? అసలేమైంది? ఈ విధ్వంసమేంటి? ఎవరు సృష్టించారు ఇంత ఉత్పాతం? అంతా ఏడుపులు, పెడబొబ్బలు...హృదయ విదారకం! మరో మూలన వంకర నవ్వులు, కర్కశ చూపులు!

'ఏమైంది? ఏం జరిగింది?' ప్రతి ఒక్కరూ తమలో తాము ప్రశ్నించుకున్నారు. అందరికీ ఎంతో కొంత అర్థమయ్యీ కానట్టుంది.

వంతెనలు, రైలు పట్టాలు నేలకూలి చెల్లాచెదురై ఉన్నాయి.



## యంగ్ రజనీ

ఈమధ్యనే 60వ ఏట అడుగుపెట్టిన రజనీకాంత్ మేకప్వేస్తే పదహారేళ్ల కుర్రాడైపోతాడని మరోసారి నిరూపించుకోబోతున్నాడు 'రోబో' సినిమాలో. తాజాగా 'రోబో' స్టిల్స్ ఎలాగో బయటికొచ్చేసాయి. వాటిని చూసినవాళ్లంతా రజనీ గ్లామర్‌కి ఆశ్చర్యపోతున్నారు. వయసు మీద పడినా కెమెరా ముందుకొచ్చేసరికి మాత్రం ఇంత యంగ్‌గా తయారైపోవడం వల్లనేమో అభిమానులు అంతగా అతనిపై తమ క్రేజ్‌ని పెంచుకుంటారు! మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్యారాయ్ అందానికి దీటుగా ఈ సినిమాలో రజనీ కనిపించబోతున్నట్టే వుంది.




బంగారం, డబ్బూ దొంగిలిస్తున్న మాఫియా దొంగని అసంకల్పితంగా పట్టుకున్న పోలీసాఫీసరుకి...ఆ తృప్తి ఎంతోసేపు నిలవలేదు. 'అతన్ని వదలకపోతే కిడ్నాప్ చేసిన నీ భార్యాబిడ్డల్ని చంపేస్తాం' అంటూ వచ్చిన బెదిరింపుల్తో భయపడుతూ వాడ్ని సెల్‌లో ఉంచి అతిథి మర్యాదలు చేస్తున్నాడు పోలీసాఫీసర్. తెల్లవారగానే కోటి ఆశల్తో బీరువా తెరిచిన వడ్డీ వ్యాపారికి బీరువాలో కుప్పలుగా చీరలే కన్పించాయి. చీరలే కావాలని కోరుకున్న అతని చీరలపిచ్చి భార్య ఆనందానికి అవధులు లేవు. కానీ, లాకర్లో ఉండాల్సిన నగల బదులు కూడా చీరలే ఉండడం చూసి గుండె ఆగినంత పనయ్యిందామెకి. శెట్టికి జనాల్తో కొట్టు నిండిపోయింది. కానీ వచ్చిన జనాలకి అమ్మడానికి శెట్టి కొట్లో ఏ సరుకూ సరిగ్గా లేదు. బియ్యంలో రాళ్ళు బదులు రాళ్ళలో బియ్యం ఉన్నాయి. పప్పుల్లో పురుగుల బదులు పురుగుల్లో పప్పులున్నాయి. శెట్టికి నిజంగానే గుండాగింది.

రాత్రి ఏ వేళనో షావుకారు మూడంతస్థుల మేడ ఉన్నపాటుగా కూలిపోయింది. ఏ చిన్న వస్తువూ సరిగా లేదు. ఆ ఇంటిని చూసిన పక్క డాబా యజమాని కళ్ళు ఆనందంతో మెరిసినా...మేడ కూలుతూ కూలుతూ తన డాబామీద కూడా పడి సగభాగం నేలమట్టమై ఉండడం చూసి ఖంగుతిన్నాడు.ఊరంతా విశేషాలే! ఎంత చూసినా వెంట వెంటనే ఆశ్చర్యకరంగా విన్పిస్తున్నాయి. ఎన్నెన్నో వార్తలు..

కూలోడి స్థలాన్ని సొంతం చేసుకుందామని కలలు కన్న షావుకారు- తను మళ్ళీ అంత మేడ నిర్మించుకోగలనో లేదోనని అయోమయంలో పడ్డాడు. గుడిశెలోంచి బయటకొచ్చిన కూలోడు మాత్రం కూలిపోయి ఉన్న మూడంతస్థుల మేడనీ, చుట్టుపక్కల విధ్వంసాన్నీ చూసి దిగులు చెందాడు. అతన్ని చూసిన షావుకారు- అతన్ని పిలిచి కూలిన మేడ స్థలాన్ని చదును చేయడానికి బేరం ఆడసాగాడు.

కూలోడి కళ్ళు మెరిశాయి. చేతినిండా పని, కడుపునిండా తిండి దొరకబోతుందని సంతోషం కలిగింది.

సంతృప్తిగా ఒళ్ళు విరిచి, బద్ధకాన్ని వదిలించుకుని, గుండెనిండా గాలి పీల్చుకుని, చేయాల్సిన పనికి ఉద్యుక్తుడయ్యాడు.

ఎవరికి వారు తమ గురించి మాత్రమే ఆలోచించడంవల్ల నష్టం ఉండదు. కానీ అందరూ దురాశకు పోయి ఏదో కోరుకుంటే ఒక్క కూలివాడు మాత్రం కష్టపడడాన్ని నమ్ముకున్నాడు. అందుకే అతనొక్కడే ఆనందంగా ఉన్నాడు.

★ ★ ★

నిర్మలత్వం, సున్నిత మనస్తత్వం, ఆనందం, ఆత్మీయత, ఆలోచన, విచక్షణ క్రమక్రమంగా నశించిపోతున్న ఈ సమాజం అన్నీ పోగొట్టుకుంటూ ఇప్పుడు నేర్చుకుంటున్నదేమిటి? చివరికి ఏం మిగుల్తుంది?

భక్తీ, ముక్తీ, సంతృప్తుల్నీ కోరుకోని జనాలు ఆశించిందేమిటి? పొందిందేమిటి? లోకంలో పెరిగిపోతున్న అసూయాద్వేషాలు ఎటు తీసుకువెళ్తాయి? ఈ దుర్భర పయనం ఎటువైపు?

★ ★ ★

జనవరి 1...అంతా కూలిపోయింది. గత జ్ఞాపకం ఒక్కటీ మిగల్లేదు.

శూన్యం మాత్రం మిగిలింది. ఆ కుళ్ళునీ, కుతంత్రాల్నీ సమాధి చేసి ప్రేమ సమాజానికి పునాదివేద్దాం రండి. మీ మనసుల్ని శుభ్రం చెయ్యండి. అనురాగపు చినుకులు కురిపించండి. బాల్యం మొలకల్ని చివురేయించండి. మొలకలంత స్వచ్ఛంగా ఎదుగుదాం రండి ★